సాక్షి అనకాపల్లి

సోమవారం । 18 । మార్చి । 2024



వెంకన్న కల్యాణం చూతము రారండి 8లో
వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలకు ఉపమాకలో ఏర్పాట్లు చేస్తున్నారు.



వేంపాడు, తాండవ చెక్‌పోస్టుల తనిఖీ 8లో
వేంపాడు, తాండవ చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి	
ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6.11	4.49
నర్సీపట్నం	
6.14	4.47

న్యూస్‌రీల్

టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

- జిల్లాలో 32 ప్రత్యేక బస్సులు ఏర్పాటు

అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఈనెల 30 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తోంది. ఈ మేరకు 32 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ జిల్లా అధికారి కె.పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6 సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల నుంచి పరీక్ష కేంద్రాలకు ఆరు బస్సులు, రెగ్యులర్‌గా తిరుగుతున్న 16 బడి బస్సులతో పాటు మరో 10 పల్లె వెలుగు బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి పదో తరగతి హాల్ టికెట్ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్టయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

చెరకు రైతు సజీవ దహనం



పోతురాజు మృతదేహం



పోతురాజు (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన సుంకర పోతురాజు(68) అనే రైతు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఆయన ఆదివారం తన పొలంలో చెరకు చెత్తకు నిప్పు పెట్టాడు. పక్కనున్న చెరకు తోటలకు కూడా ఆ మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా గాలికి పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలు పోతురాజు చుట్టూ వ్యాపించడంతో సజీవ దహనమైనట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేరని చెప్పారు. పోతురాజుకు భార్య చెల్లయమ్మ, వివాహమైన ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టానికి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హాయ్.. కియారా



షూటింగ్‌కు వస్తున్న కియారా అద్వానీ

కొమ్మాది(విశాఖ): ఆర్.కె.బీచ్‌లో నటి కియారా అద్వానీ ఆదివారం సందడి చేశారు. పరిసర ప్రాంతాల్లో ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. తోటి నటీనటులతో ఆమె షూటింగ్‌లో పాల్గొన్నారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ హీరోగా, కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈసినిమాను దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సంగీతం ఎస్.ఎస్ థమన్ అందిస్తున్నారు.

మా దారి మాదే?

- టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నేతల్లో నైరాశ్యం
- స్వతంత్రులుగా పోటీకి దిగాలని కొందరు..
- పార్టీ మారాలని మరికొందరు యత్నం
- చేజారి పోకుండా ఆ పార్టీ అభ్యర్థుల మంతనాలు



సాక్షి, విశాఖపట్నం : జనసేనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ పార్టీ నేతలు దిక్కులు చూస్తున్నారు. ఒకపక్క టికెట్లు దక్కకపోవడం, మరోపక్క టీడీపీతో పొత్తులో అరకొర సీట్లకే అధ్యక్షుడు అంగీకరించడంపై వీరు ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీ పుట్టుక నుంచి కష్టపడి పనిచేస్తున్న వారిని పక్కనబెట్టేసి నిన్నగాక మొన్న వైఎస్సార్ సీపీ నుంచి జంప్ చేసి వచ్చిన వారికి సీట్లు కేటాయించడం వీరికి అస్సలు మింగుడు పడడం లేదు. పెందుర్తి సీటు పంచకర్ల రమేష్‌బాబుకు, విశాఖ దక్షిణ సీటు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఖరారు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లూ అంతా మీరే.. భవిష్యత్తు మీదే.. అంటూ పార్టీ కోసం అన్ని పనులూ చేయించుకుని ఇప్పుడు కరివేపాకుల్లా తీసి పారేశారని సీనియర్లు రగిలిపోతున్నారు. టీడీపీతో పొత్తు ఖరారై, సీట్ల ప్రకటన జరిగాక తమను అస్సలు పట్టించుకోవడమే లేదని వీరు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకే చుక్కెదురు!

విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఉన్నారు. వీరిలో ఒకరు టి.శివశంకర్ కాగా మరొకరు బొలిశెట్టి సత్యనారాయణ. శివశంకర్ పెందుర్తి సీటును, బొలిశెట్టి అనకాపల్లి ఎంపీ స్థానాన్ని ఎప్పట్నుంచో ఆశిస్తున్నారు. ఇప్పుడు వారిద్దరికీ సీట్లు దక్కలేదు. కొన్నాళ్ల క్రితం వరకు 'పెందుర్తి సీటుపై ముందుగా మీతో సంప్రదించాకే నిర్ణయం తీసుకుంటారు' అంటూ జనసేన ముఖ్య నాయకులు శివశంకర్‌కు చెబుతూ వచ్చారు. తీరా ఆ సీటును వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించారు. అనంతరం ఆ పార్టీ మీడియా వ్యవహారాలు చూసే వ్యక్తితో శివశంకర్‌కు ఫోన్ చేయించి సారీ చెప్పించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన పార్టీకో నమస్కారం పెట్టేసి తిరిగి లాయర్‌గా ప్రాక్టీసు చేసుకుంటానని అనుచరుల వద్ద వాపోయినట్టు తెలిసింది. మరో ప్రధాన కార్యదర్శి బొలిశెట్టిదీ అదే పరిస్థితి. ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు విజయవాడలో అధినేత పవన్‌ను కలవడానికి వెళ్లిన ఆయనకు చుక్కెదురైంది. తాను ప్రధాన కార్యదర్శినని చెప్పినా 'సో వాట్' అంటూ గెంటేసినంత పనిచేశారని, దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెబుతున్నారు.

వారందరికీ మొండిచెయ్యి!

విశాఖ దక్షిణ సీటుపై జనసేనలో నలుగురైదుగురు ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాళ్లూ వీరు చేతి చమురును భారీగానే వదిలించుకున్నారు. ఇప్పుడు వారిని కాదని వంశీకృష్ణకు కేటాయించారు. ఇక భీమిలి టికెట్టు తనకే ఖాయమైందని సంబరాలు చేసుకున్న పంచకర్ల సందీప్‌ను కూడా 'త్యాగరాజు' జాబితాలో చేర్చేశారు. మరోవైపు విశాఖ ఉత్తర సీటు కోసం ఎదురు చూస్తున్న పసుపులేటి ఉషాకిరణ్‌కూ మొండిచెయ్యే చూపారు. కొన్నేళ్లుగా గాజువాక టికెట్టును ఆశిస్తున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకూ ఝలక్ ఇచ్చారు. అంతేకాదు.. చోడవరం సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రాజుకూ ఆశాభంగమే ఎదురైంది. ఈయన టీడీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే ఇప్పటికే అనకాపల్లి సీటునాశించి భంగపడ్డ పరుచూరి భాస్కరరావు జనసేనకు గుడ్‌బై చెప్పేశారు. ఇప్పుడు అక్కడ జనసేన అభ్యర్థిని ఓడించే పనిలో ఉన్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఎవరి దారి వారు చూసుకోవాలని..

తాజా పరిస్థితులతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన శ్రేణులు తీవ్ర నిరుత్సాహంగా ఉన్నారు. జనసేన టికెట్లు ఆశించి భంగపడిన వారు ఆ పార్టీలో ఇంకా కొనసాగేకంటే ఎవరి దారి వారు చూసుకోవాలని యోచిస్తున్నారు. వారిలో కొందరు స్వతంత్రులుగా పోటీ చేసి తమ సత్తా చాటుకోవాలని, మరి కొందరు మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి చేరాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిని జనసేన జిల్లా, నగర అధ్యక్షులు పంచకర్ల, వంశీకృష్ణలు పార్టీని వీడి వెళ్లవద్దని బతిమలాడుతున్నారు. వారిని చేజారిపోకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యార్థీ... విజయోస్తు..

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లా పరీక్ష కేంద్రాలు	:	108
సమస్యాత్మక సెంటర్లు	:	7
హాజరు కానున్న విద్యార్థులు	:	23,583
ఇన్విజిలేటర్లు	:	1,222



ఏఎంఏఎల్ హైస్కూలు పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంఈవో-2 కోటేశ్వరరావు

యలమంచిలి రూరల్: జిల్లాలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు... ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. విద్యార్థుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. మాల్‌ప్రాక్టీస్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. జిల్లాలో 23,583 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 21,259 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 10,873 మంది బాలురు, 10,386 బాలికలు పరీక్షలు రాయనున్నారు.

3 కేటగిరీలుగా కేంద్రాలు

జిల్లాలో 108 మంది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎ కేటగిరీ 33, బి కేటగిరీ 47, సి కేటగిరీ 28 కేంద్రాలున్నాయి, కేంద్రాల వద్ద సిబ్బంది విధిగా గుర్తింపు కార్డులు ధరించాలని అధికారులు ఆదేశించారు. బాలికలను తనిఖీ చేయడానికి మహిళా సిబ్బందిని నియమించారు. విద్యార్థులు సివిల్ దుస్తుల్లో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

పటిష్ట నిఘా

పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ ఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.1222 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.వీరితో పాటు 108 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 108 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 28 మంది కస్టోడియన్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 11 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.29 స్టోరేజ్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. తాగునీరు, టాయిలెట్‌లు, తగినంత గాలి, వెలుతురు, ఫ్యాన్‌లు,ఫర్నీచర్ ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. పదవ తరగతి ప్రశ్నపత్రాల తయారీలో ప్రభుత్వం కొత్త టెక్నాలజీని ఉపయోగించింది. ఎవరైనా ప్రశ్నపత్రాన్ని ఫొటో లేదా జెరాక్స్ తీస్తే అది ఏ ఊరు, ఏ కేంద్రం ,ఏ విద్యార్థికి కేటాయించినదో తెలిసిపోతుంది.

దూరవిద్యా పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్‌స్కూల్ ఆధ్వర్యంలో దూరవిద్య విధానంలో పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.పదవ తరగతి విద్యార్థులు 788 మంది,ఇంటర్ విద్యార్థులు 2,24మంది హాజరుకానున్నారు. పదవ తరగతికి 5, ఇంటర్‌కు 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చాం. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సమన్వయంతో పని చేయాలి.1997 యాక్ట్ -25 అమలు చేస్తున్నందున పరీక్ష నిర్వహణలో ఉన్న అందరూ అప్రమత్తంగా ఉండాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించాం, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

'గేట్'లో మెరిసిన జిల్లా విద్యార్థులు



కర్రి నాయుడు



సంధ్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మునగపాక/రావికమతం: గేట్-2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. మునగపాక మండలంలోని గణపర్తి గ్రామానికి చెందిన కర్రి నాయుడు 7వ ర్యాంక్ సాధించాడు. కర్రి పరమేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు నాయుడు ప్రస్తుతం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ నాల్గవ సంవత్సరం మెరైన్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఎంటెక్‌లో ప్రవేశం చేందుకు గేట్ పరీక్షకు హాజరయ్యాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో నాయుడు ఆలిండియా స్థాయిలో 7వ ర్యాంక్ సాధించాడు. నాయుడు కుటుంబ సభ్యులు కొంత కాలంగా అనకాపల్లి కొత్తూరులో నివాసం ఉంటున్నారు. నాయుడు తండ్రి పరమేశ్వరరావు ఆర్మీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నాయుడు కష్టపడి చదివి ఆలిండియా స్థాయిలో మెరుగైన ర్యాంక్‌ను సాధించడం పట్ల గణపర్తి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే రావికమతం మండలం గుమ్మాళ్లపాడు గ్రామానికి చెందిన కె.వి.ఎస్.సంధ్య జాతీయస్థాయిలో 171 ర్యాంక్ సాధించింది. ఈమెది సాధారణ రైతు కుటుంబం. కాళింగ తాతలు, వెంకట రమణమ్మ రెండవ కుమార్తె అయిన సంధ్య టెన్త్ వరకూ చినపాచిల హైస్కూల్‌లో చదివి 9.3 పాయింట్లు సాధించి, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేస్తోంది. గేట్ పరీక్షకు కోచింగ్ తీసుకుని మొదటి ప్రయత్నంలోనే 171 ఆలిండియా జనరల్ కేటగిరిలో ర్యాంక్ సాధించింది.

ఏఐఎస్ఎస్ఈఈలో మేధర్షికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

- మేధర్షి స్వగ్రామం అచ్యుతాపురం మండలం నునపర్తి
- విశాఖలో శిక్షణ



రెడ్డి మేధర్షి

అచ్యుతాపురం : మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి మేధర్షి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2024లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఇటీవల ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో మేధర్షి 300 మార్కులకు గానూ 283 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్, జాతీయ స్థాయిలో 43వ ర్యాంక్ సాధించాడు. ఈ బాలుడు హైదరాబాద్‌లోని సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మేధర్షి మల్టీ టాలెంటెడ్ విద్యార్థి. నృత్యం,పాటల్లో కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు.

తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రెడ్డి మేధర్షి తండ్రి రాజేష్, తల్లి స్వర్ణలతలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. కాంపిటేటివ్ స్పిరిట్ పెరగాలనే లక్ష్యంతో మేధర్షికి విశాఖలోని వైజాగ్ సైనిక్ అకాడమీలో ఆన్‌లైన్ ద్వారా నాలుగు నెలల పాటు శిక్షణ ఇప్పించారు. ఈ బాలుడు రాణిస్తున్న తీరును చూసిన అకాడమీ ఇన్‌చార్జ్ భాస్కర్ సూచనల మేరకు స్కూల్‌కి రెండు నెలల పాటు సెలవు పెట్టి ఏఐఎస్ఎస్ఈఈ పరీక్షకు ఆఫ్‌లైన్‌లోనూ శిక్షణ ఇప్పించారు. భాష,మేధస్సుకు సంబంధించిన విభాగంలో



మేధర్షికి మిఠాయి తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

యాభైకి యాభైకి మార్కులు పొందిన మేధర్షి మొత్తం 300 మార్కులకు గానూ 283 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 43వ ర్యాంక్,ఏపీ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ పరీక్ష కోసం రోజుకి పదిగంటలకు పైగా శ్రమించిన మేధర్షి సివిల్స్,ఎంబీబీఎస్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. మేధర్షికి ఏపీలో మొదటి ర్యాంక్ రావడంతో నునపర్తిలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నియమావళి ప్రకారం ఎన్నికల ప్రక్రియ

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: ఎన్నికల నియమావళిని అనుసరించి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనుబంధ కమిటీలు నిర్దేశించిన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల లోపల బయట ఉన్న హోర్డింగులు తొలగించాలని, రాజకీయ నాయకుల బొమ్మలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి బ్యానర్లు, జెండాలు ఉండరాదన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపరాదని తెలిపారు. అంతకుముందు విజయవాడ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ ఎం.కె.మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు.



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి

ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. నోడల్ అధికారులు నిబద్ధతతో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంసీసీ, ఎంసీఎంసీ వీడియో వీవింగ్, వీడియో సర్వేలెన్స్, టీమ్‌లు అప్రత్తమంగా పనిచేయాలన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను ఇక్కడి నుంచే పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గాల నుంచి వచ్చిన రిపోర్టులను ఇక్కడి నుంచే ఎన్నికల కమిషన్‌కు పంపించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, నర్సీపట్నం, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ల అధికార్లు హెచ్.వి.జయరామ్, ఎ.చిన్నికృష్ణ, జీఎస్ డబ్ల్యూఎస్ మంజులవాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, డీసీవో కిరణ కుమారి, లీడ్ బ్యాంకు మేనేజరు సత్యనారాయణ, మత్స్యశాఖ డీడీ ప్రసాద్, డీఎస్‌వో కె.వి.ఎల్. మూర్తి, కంట్రోల్ కమాండ్ రూమ్ నోడల్ అధికారి ప్రసాదరావు, ఎన్నికల ఖర్చు విభాగం నోడల్ అధికారి జి.సత్యనారాయణ, ఎంసీఎంసీ నోడల్ అధికారి జి.వి.లక్ష్మి, డీపీఆర్వో డి.సాయిబాబా పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన సీడీసీ పాలకవర్గం



సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, డైరెక్టర్లను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి/మాడుగుల: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధి చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) నూతన పాలకవర్గ సభ్యులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, డైరెక్టర్లు అన్నం రాము, పల్లె రామునాయుడు తదితరులు దేవరాపల్లి మండలం తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని డిప్యూటీ సీఎం శాలువాలతో సత్కరించి అభినందించారు. రైతులకు సహాయ సహకారాలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలం జానకీరామ్, పల్లె వెంకటరమణ, పి.టి. బాబు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న నాయుడు

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన యువకుడు ఆదివారం సాయంత్రం చెట్టుపై నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. నాగులాపల్లికి చెందిన ఎంజే నాయుడు ఆదివారం సాయంత్రం పొలంలో పనిచేస్తున్నాడు. సాయంత్రం కొబ్బరి చెట్టు ఎక్కే ప్రయత్నం చేయగా కిందపడిపోయాడు. ఈ సంఘటనలో నాయుడు రెండు చేతులు దెబ్బతిన్నాయి. గెడ్డం దిగువన కూడా దెబ్బలు తగిలాయి. వెంటనే అతడిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు అందిస్తున్నారు.

వెంకన్న కల్యాణం చూతము రారండి



ఆలయం ముందు ఏర్పాటు చేస్తున్న షెడ్లు



మెట్లమార్గంలో రంగులు, రెయిలింగులు ఏర్పాటు చేసిన దృశ్యం

- ఉపమాకలో భారీగా ఏర్పాట్లు
- రేపటి నుంచి 25 వరకు ఉత్సవాలు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం, తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయం నక్కపల్లి మండలం ఉపమాకలోని వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతిఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశినుంచి వారం రోజుల పాటు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఆగమశాస్త్రానుశారం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ నెల19 నుంచి 25 వరకు కల్యాణోత్సవాలు జరగనున్నాయి. 19 వ తేదీ సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రిత్విక్ వరుణ, కంకణ ధారణ, అంతరాలయ పూజ నిర్వహించిన అనంతరం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేయింపుజేసి తిరువీధి సేవతో మృత్యంగ్రహణం(పుట్టమన్ను)తీసుకువచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు. దీన్ని అంకురార్పణగా పేర్కొంటారు. తదుపరి స్వామివారి ఉత్సవ మూర్తులను అశ్వవాహనంపై ఉంచి తిరువీధి సేవ నిర్వహిస్తారు. తర్వాత ఆలయంలో వార్షిక కల్యాణ మండపంలో స్వామివార్లను ఉంచి అంకురార్పణ అగ్నిప్రతిష్టాపన, చతుస్థాన అర్చనలు నిర్వహిస్తారు. స్వామివారి ఉత్సవ కావిడెను గ్రామంలో ఊరేగిస్తారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరి బొండాలు సమర్పిస్తారు. అనంతరం 20వతేదీ ఏకాదశి సందర్భంగా తెల్లవారు జామున గరుడాద్రిపై గల మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, నివేదనలు తీర్థగోష్ఠి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం భేరీ పూజ తర్వాత అనంతరం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. స్వామివారి కల్యాణోత్సవాలకు అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తారు.పెద్దపల్లకిలో స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.రాత్రి ఏడుగంటలకు ఇత్తడి గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామివారిని, ఇత్తడి గజవాహనంపై అమ్మవార్లను ఉంచి తిరువీధి నిర్వహించి, ఎదురు సన్నాహ మహోత్సవం జరుపుతారు.అనంతరం రథోత్సవం, రాత్రి 11 గంటకు స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కలవరప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాలు 25వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా ఏర్పాట్లు..

ఈ ఉత్సవాల నిర్వహణకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ఎదురుగా ఖాళీ ప్రాంతంలో భక్తులు కూర్చొని స్వామివారి కల్యాణం తిలకించేందుకు, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు సేదతీరేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి గాలిగోపురాలకు మెట్ల మార్గాలకు, ఆకర్షణీయమైన రంగులు వేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ విద్యుద్దీపాలంకరణ, స్వామివారి పుష్కరిణి వద్దరక్షణ చర్యలు, ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు, బారికేడ్లు, ప్రత్యేక దర్శనాల కోసం అదనంగా క్యూలైన్లు, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవ మూర్తులున్న సన్నిధి, ఆండాళ్లమ్మవారి సన్నిధి చుట్టూ పెంటార్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. బేడామండం, ధ్వజస్తంభం వద్ద పూలతో అలంకరించనున్నారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట నలుమూలలనుంచి లక్షలాది మంది తరలిరానుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ అంబటి విజయ్‌కుమార్ తెలిపారు.

‘డిప్యూటీ సీఎం...హ్యాట్రిక్ ఖాయం’

- మూడోసారి టికెట్ దక్కడంపై తారువలో సంబరాలు
- డిప్యూటీ సీఎం బూడికి పార్టీ శ్రేణులు, ప్రజలు అభినందనలు
- కోట్లాది రూపాయలతో మాడుగుల నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి



తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు



దేవరాపల్లిలో సంబరాలు జరుపుకొంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మాడుగుల : డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మూడోసారి మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆదివారం దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను కలిసి హ్యాట్రిక్ ఖాయమని పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.కోట్లు ఎరచూపి ప్రలోభాలకు గురిచేసినా తలొగ్గకుండా తనను నమ్ముకున్న పార్టీని, తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను వమ్ము చేయకుండా కొనసాగారు. ఆ నిజాయితీయే సామాన్య రైతు బిడ్డను డిప్యూటీ సీఎం హోదా వరకు తీసుకెళ్లింది. ఇంటర్మీడియెట్‌తో చదువు ముగిసిన తరువాత తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. 1981లో రాజకీయ రంగ ప్రవేశం చేసి తన గురువు గుడివాడ గురునాథరావు ఆశీస్సులతో కాంగ్రెసు పార్టీ రాష్ట ప్రచారదళ్ జాయింట్ కన్వీనర్‌గా చురుకైన పాత్ర పోషించారు. వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, కాంగ్రెసు పార్టీ దేవరాపల్లి మండలాధ్యక్షుడిగా, జెడ్పీటీసీగా ఎంపీటీసీగా, ఎంపీపీగా పదవులు నిర్వర్తించారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత డిప్యూటీ సీఎంతోపాటు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పదవి దక్కడంతో దశాబ్దాలుగా వెనుకబడిన మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించారు. కోట్లాది రూపాయలతో గ్రామ గ్రామాన రోడ్లు వేయడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారు. ఇప్పటికి రెండు సార్లు ఎన్నికల్లో సునాయాసంగా విజయం సాధించిన బూడి మూడోసారి గెలుస్తారని ప్రతిపక్ష నేతలే చెప్పుకోవడం గమనార్హం.

అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ స్థాయి నుంచి పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ బి.వి. సత్యవతి అన్నారు. 82 వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్‌లో వార్డు కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌ను మోడల్ రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు.

5 ఏళ్లలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎక్కడా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా అర్హులైన లబ్ధిదారులందరికి నేరుగా అందజేసిన ఘనత దేశ చరిత్రలో మన ప్రభుత్వానికే దక్కిందన్నారు. పార్లమెంటు పరిధిలో సుమారుగా రూ.34 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంతానికి చెందిన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం పట్ల ఎంతగానో ఆనందిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలను గుర్తించి ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ రాష్ట యువజన విభాగ కార్యదర్శి పలక రవి, రాష్ట వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీ నరసింహరావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు మున్నూరు శ్రీనివాసరావు గైపూర్ రాజు, పలక సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు, ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు ఆదేశించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాంతో కలిసి ఆయన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని అధికారులకు సూచించారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఇప్పటికే విగ్రహాలకు ముసుగులు వేశామని, రాజకీయ ఫ్లెక్సీలను తొలగించామని అసిస్టెంట్ కలెక్టర్ దృష్టికి ఆర్డీవో తీసుకువెళ్లారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ పూడి రవి బాబు పాల్గొన్నారు.

ప్రత్యర్థులు ఎదురైన వేళ

- చోడవరం శివాలయంలో అన్నసమారాధన
- పలకరించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- టీడీపీ అభ్యర్థి రాజుకి వడ్డించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మశ్రీ



ఆలయంలో జరిగిన అన్నసమారాధన లో టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే రాజుకి వడ్డించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం : సార్వత్రిక ఎన్నికల వేళ చోడవరం శివాలయంలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు ఎదురుపడి ఒకరు వడ్డిస్తుంటే మరొకరు ఆకులో భోజనం పెట్టించుకొని చిరునవ్వుతో పలకరించుకున్న సంఘటన అక్కడ చర్చనీయాంశమైంది. చోడవరంలో ప్రాచీన దేవాలయమైన శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో ఇటీవల స్వామివారి శివరాత్రి, కల్యాణమహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమరాధనలో వందలాది మంది భక్తులు రావడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో కలిసి వచ్చిన వారందరికీ భోజనం వడ్డన చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంతలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తన అనుచరులతో కలిసి ఈ అన్నసమారాధనకు వచ్చారు. అందరితో కలిసి భోజనం చేసేందుకు క్యూలో నిలబడ్డ ఆయనకు ధర్మశ్రీ వడ్డించారు. ఇద్దరూ చిరునవ్వుతో పలకరించుకొని ఆలయ అభివృద్ధి కోసం ముచ్చటించుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థులిద్దరూ ఒకే వేదికపై ఇలా అన్నసమారాధనలో పాల్గొని ముచ్చటించుకోవడాన్ని అక్కడ ఉన్నవారంతా ఆసక్తిగా తిలకించారు. ఇదిలావుండగా శివాలయంలో నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో చోడవరం పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక అర్చన చేసి అన్నసమారాధనను ప్రారంభించారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు పాల్గొన్నారు.

వేంపాడు, తాండవ చెక్‌పోస్టుల తనిఖీ

కశింకోట, యలమంచిలి ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌నూ తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



యలమంచిలి వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలోని నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఉన్న పోలీసు చెక్ పోస్టు, పాయకరావుపేటలో గల తాండవ సుగర్స్ లిమిటెడ్ వద్ద పోలీసు చెక్ పోస్టును ఆదివారం కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్టు మీదుగా వెళ్లే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మద్యం, సారా, మత్తు పదార్థాలు, అక్రమ రవాణాను అరికట్టాలని, నగదు, ఉచిత కానుకలు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కశింకోట, యలమంచిలి ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను కూడా వారు తనిఖీ చేశారు. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, నక్కపల్లి ఎస్‌హెచ్‌వో ధనుంజయ రావు, పాయకరావుపేట ఎస్‌హెచ్‌వో అప్పలరాజు, నక్కపల్లి ఎస్‌హెచ్‌వో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మరుగుతున్న సాంబారు పడి బాలికకు గాయాలు



గాయపడిన లోహిత

యలమంచిలి రూరల్: ఇంట్లో పొయ్యిపై మరుగుతున్న సాంబారు పడి మూడేళ్ల పాప లోహిత గాయపడిన ఘటన మండలంలోని లైనుకొత్తూరు రామకృష్ణాపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. ఆడుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు బాలిక తల్లి తెలిపింది. పాపకు యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమచికిత్స అందజేశారు. అవసరమైతే మెరుగైన చికిత్సకోసం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి గాని,విశాఖ కేజీహెచ్‌కు గానీ తరలిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

కొత్తకోటలో ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



నూకాంబిక ఆలయానికి ఘటాలతో బయలుదేరిన మహిళలు

రావికమతం : కొత్తకోట గ్రామంలో శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఊరూవాడ ఏకమై ఇంటికో ఘటంతో డప్పుల వాయిద్యాలతో వేలాదిగా మహిళలు తరలివచ్చారు. సంబరాన్ని చూసేందుకు జనాలు తరలిరావడంతో రోడ్లు కిక్కిరిసాయి. అమ్మవారికి ఘనంగా సారె సమర్పించి ఆపై భారీ అన్నసమారా ధన నిర్వహించారు. అలాగే గ్రామంలో భక్తాంజనేయ స్వామివారి ఆల య 30వ వార్షికోత్సవాలు కూడా ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సముద్రంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



గరికిన కొత్తబాబు మృతదేహం



బోరున విలపిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

పాయకరావుపేట : వెంకటనగరం గ్రామ పంచాయతీ శివారు గ్రామం రాజానగరం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరికిన కొత్తబాబు (52) సముద్రంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. వివరాలివి. కొత్తబాబు, అతని కుమారుడు తాతాజీ, గ్రామానికి చెందిన సిరిపల్లే రామదాసు ముగ్గురు కలిసి ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో సముద్రం పైకి చేపల వేటకు బయలు దేరారు. వీరు ముగ్గురూ వెళ్తున్న బోటు 100 మీటర్ల దూరం వెళ్లేసరికి సముద్రం అలలకు వెనక్కి తిరగబడింది. దీంతో ముగ్గురూ సముద్రంలో మునిగిపోయారు. కొత్తబాబు నీటిలో ఊపిరి ఆడక కొట్టుకుంటుండగా మిగిలిన ఇద్దరూ కలిసి అతనిని సముద్రం ఒడ్డుకు తీసుకువచ్చి, చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. కాగా మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు వున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తబాబు చనిపోవడంతో అతని భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగి మృతితో విషాదం

- ములకలాపల్లిలో ఘటన
- ఆదుకోవాలని కలెక్టర్‌కు ఫోన్లో డిప్యూటీ సీఎం ఆదేశం



చిరంజీవి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట గ్రామ సచివాలయం పరిధి ములకలాపల్లిలో ఆదివారం ఉదయం విద్యుత్ ఘాతానికి గురై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి (34) మృతి చెందాడు. ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లెక్సీలు తొలగిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దాంతో ఈ రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన అతని మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. మృతుడికి తల్లి కృష్ణమ్మతోపాటు భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3) ఉన్నారు. మృతుడి తండ్రి పదేళ్ల క్రితం మరణించగా, తల్లి అనారోగ్యంతో మంచానపడ్డారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న చిరంజీవి మృతి చెందడంతో తమకు దిక్కెవరంటూ అతడి భార్య రోదించిన తీరు పలువురి హృదయాలను కలచి వేసింది. డ్యూటీకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా, ఇప్పుడు పిల్లలని ఎలా పోషించాలంటూ విలపించడం పలువుర్ని కంటతడి పెట్టించింది. మండలంలోని సచివాలయ ఉద్యోగులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించామన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం పరామర్శ...

వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరంజీవి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదం తీరును కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, గొర్లి కొండలరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కలెక్టర్ రవిపట్టన్ శెట్టిని ఫోన్లో ఆదేశించారు.

క్లుప్తంగా

కొత్త అమావాస్య జాతరకు రాట మహోత్సవం



కొత్త అమావాస్య రాట వేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి : స్థానిక తాకాశీవీధి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద రాట మహోత్సవాన్ని ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కోడ్ పాటిస్తు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాకాశి కన్నబాబు, చందు, వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కశింకోట : మండలంలో టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యా శాఖ అధికారి కె. చిట్టిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1344 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకు ఆరు పరీక్షా కేంద్రాల ను ఏర్పాటు చేశామన్నారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ హైస్కూలు,బాలికల హైస్కూలు, వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూలు, తాళ్లపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం జెడ్పీ హైస్కూళ్లలో కేంద్రాలు ఏర్పా టు చేశామన్నారు. ఈ నెల 27 వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

పడమటమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



సోమునాయుడును సత్కరిస్తున్న సభ్యులు

తుమ్మపాల : మండలంలో తమ్మయ్యపేట పడమటమ్మ తల్లి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బోర సోమునాయుడు, ఈశ్వరమ్మ దంపతులు రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు గర్భగుడి నిర్మాణం నిమిత్తం ఆదివారం రూ. 25 వేలు అందించి తదుపరి మరో రూ.25 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆలయానికి ఆర్థిక సహాయం చేసిన దాతలను కమిటీ సభ్యులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో నగదు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా రూ.పది వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మ్యాట్నీ)	: షిర్డిసాయి
రజాకర్	: పర్తిసాయి
తంత్ర	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 461 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 373 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

సుదీర్ఘ నిరీక్షణకు.. చక్కటి ఫలితం

- నరసింగబిల్లి పశు వైద్య కేంద్రానికి సొంత భవనం
- పాడి రైతుల హర్షం



ప్రస్తుతం పశు వైద్య కేంద్రం నడుస్తున్న సామాజిక భవనంలో సేవలందిస్తున్న డాక్టర్ చైతన్యమణి



నరసింగబిల్లి పశు వైద్య కేంద్ర నూతన భవనం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రానికి దాదాపు ఏడేళ్ల తర్వాత సొంత భవనం సమకూరింది. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసి ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఐదేళ్లుగా సామాజిక భవనంలో నడుస్తున్న పశు వైద్య కేంద్రానికి సొంత భవనం సమకూరడంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నరసింగబిల్లిలో గ్రామీణ పశు వైద్య కేంద్రం సుమారు మూడు దశాబ్దాల క్రితం నుంచి జాతీయ రహదారి పక్కన గల భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఇది కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో దాదాపు దశాబ్దం క్రితం సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు కొంత వరకు జరిగిన తర్వాత నిధులు సరిపోక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ తర్వాత తుపాను నిధులు కేటాయింపు జరిగినప్పటికీ ఎవరూ నిర్మాణానికి ముందుకు రాక దాదాపు ఏడేళ్లు అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆస్పత్రి కేంద్ర భవనాన్ని పూర్తి చేయడానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో రూ.8 లక్షలు మంజూరు అయ్యాయి. దీంతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇటీవల మంత్రి ప్రారంభించారు. గ్రామీణ పశు వైద్యశాల నుంచి పశు వైద్య కేంద్రంగా మార్పు చెందిన ఆస్పత్రి సామాజిక భవనంలో కొనసాగడం, అక్కడ పశువులకు వైద్య సేవలందించడానికి సరైన సదుపాయాలు లేకపోవడం, ప్రమాదకరమైన జాతీయ రహదారి దాటి పశువులు రావాల్సి ఉండటం, ఆస్పత్రి, వైద్యులు అందుబాటులో ఉన్నా పూర్తిస్థాయిలో సేవలందని పరిస్థితి ఉండేది. దీంతో ఈ కేంద్ర పరిధిలో ఉన్న నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, ఏఎస్ పేట, సోమవరం, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, త్రిపురవానిపాలెం తదితర గ్రామాల రైతులు ఇబ్బంది పడేవారు. కొందరు వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వచ్చేది. పశువులను తీసుకురాలేక ఇక్కడి వైద్యునికి పశువుల సమస్యలు వివరించి మందులు తీసుకెళ్లేవారు రైతులు. ఇప్పుడు ప్రభుత్వం పుణ్యమా అని పశు వైద్య కేంద్రానికి సొంత భవనం సమకూరడంతో ఇక వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందగలవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాడి రైతులకు మేలు..

పశు వైద్య కేంద్రం సొంత భవనం సమకూర్చుకుంది. ప్రారంభోత్సవం కూడా జరిగింది. పశువులకు సేవలందించడానికి అన్ని సదుపాయాలతో ఆస్పత్రి నిర్మాణం పూర్తి అయింది. ప్రస్తుతం నడుస్తున్న సామాజిక భవనం నుంచి నూతన సొంత భవనంలోకి తక్షణమే మార్పు చేసి సేవలందించనున్నాం. దీంతో పాడి రైతులకు మేలు జరుగుతుంది.

– డాక్టర్ చైతన్యమణి,
పశు వైద్యాధికారి, నరసింగబిల్లి.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం
- ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



హాజరైన పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిపై గ్రామాల్లో ప్రజలకు విస్తృత ప్రచారం ద్వారా వివరించాలని పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయదుందుభి మోగించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ఉగ్గినపాలెం వద్ద వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి దాదాపు నెరవేర్చారన్నారు. పింఛన్లు రూ.3 వేలకు పెంపు, అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర సంక్షేమ పథకాలను పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా అమలు చేశారన్నారు. అలాగే గతంలో ఎన్నడూలేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు అత్యంత చేరువ చేశారన్నారు. వీటిపై ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాలను ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల్లో ప్రాధాన్యత భవనాల నిర్మాణంతో పాటు సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారని చెప్పారు. గతంలో లేని విధంగా అత్యధిక సంఖ్యలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారన్నారు. వీటిని ప్రధానంగా ఓటర్ల దృష్టికి తీసుకు వెళ్లి పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 50 రోజుల పైగా గడువు ఉందని, పార్టీ విజయానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ కుమార్‌కు ఘన విజయం చేకూర్చడానికి అంతా కృషి చేయాలన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండల వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, అనకాపల్లి మండలాధ్యక్షుడు గొర్లి సూరిబాబు, అనకాపల్లి పార్టీ యువజన విభాగం నాయకుడు భీశెట్టి జగన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. మండలం నుంచి అధికంగా కార్యకర్తలు హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



భరత్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరం గ్రామానికి చెందిన నలుగురు స్థానిక నాయకులు ఆదివారం తమ అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సమక్షంలో ఉగ్గినపాలెంలో జరిగిన మండల పార్టీ శ్రేణుల సమావేశంలో ఎద్దు అప్పారావు, గొంతిన నాయుడు, కుంచ ఉపేంద్ర, నారిపల్లి నానాజీ చేరారు. వారికి కండువాలు కప్పి భరత్‌కుమార్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సోమవరం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌతునాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

20న దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి కల్యాణం

అనకాపల్లి : స్థానిక దేమునిగుమ్మం దేవాలయంలో శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, అలమేలు మంగ కల్యాణం ఈనెల 20న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 రాత్రి 7 గంటలకు సంకల్పం, 20న ధ్వజారోహణం, ఎదురు సన్నాహం, రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. 21న స్థాలీపాకం, 22 ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తబృందం వారిచే నామసంకీర్తన, 23న స్వామివారి గరుడ సేవ, 24న ధ్వజావ రోహణం, గీతా పారాయణం, రాత్రికి డోలోత్సవం, 25న పుష్పయాగోత్సవం, ద్వాదశకాలార్చన, సప్తప్రాకార సేవ, దర్పణ దర్శనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కమనీయం.. కల్యాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: భద్రావతి సమేత శ్రీ భవన్నారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. స్థానిక వేల్పుల వీధి కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం స్థలంలో అనకాపల్లి పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అర్చకులు ఆమంచి ఆంజనేయులు ఈ మహోత్సవాన్ని జరిపించారు. ముందుగా ఉదయం 9 గంటలకు సారె ఊరేగింపు నిర్వహించారు. అనకాపల్లి ముప్పనా సిల్క్స్ నుంచి కల్యాణ వేదిక వరకు స్వామివారి రథంతో ఊరేగింపుగా వచ్చారు. కల్యాణం అనంతరం సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కల్యాణ మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వానపల్లి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్షులను కాపాడుకునే బాధ్యత అందరిదీ



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పక్షులకు ధాన్యపు కంకులు ఏర్పాటు చేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి : వేసవిని దృష్టిలో పెట్టుకుని పక్షులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ వృక్షమిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధిలోని వివిధ దేవాలయాల్లో 58 ధాన్యపుకంకులు, తాగునీటి మట్టిపాత్రలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పక్షులు అధిక ఉష్ణోగ్రతకు ఇబ్బంది పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నేటి నుంచి ప్రతి ఇంటిపై పక్షులకు కొద్దిగా తిండి గింజలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. 10 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో పక్షుల పరిరక్షణకు అనేక కార్యక్రమలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని రకాల పక్షులు అంతరించిపోతున్నాయని, ఉన్న పక్షులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్యనారాయణ, విల్లూరి పైడారావు, ఆళ్ల నాగేశ్వరరావు, కె.గణేష్, రాజేష్, బి.వినోద్‌కుమార్, బొడ్డేడ మురళీ, కర్రి హనుమంతరావు, అనిత, నీలవేణి, రంజిత తదితరులు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీనివాసరావు

అనకాపల్లి : నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని, 40 సంవత్సరాలు పైబడి ప్రతి వ్యక్తి ఏడాదికి రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు పాలమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గంట పాటు స్పీడ్ వాకింగ్ చేయడంతో శరీరంలో రక్తప్రసరణ బాగా జరుగుతుందని, వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వయస్సును బట్టి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని, రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌లు తీసుకోవడంతో వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు వైద్యుడు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ ఆశయసాధనకు కృషి

తుమ్మపాల : నీతి, నిజాయితీలతో ఆదర్శవంతమైన పాలన అందించిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా సీనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన సీనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి, ఎన్టీఆర్ లిటరేట్స్ అధ్యక్షుడు, విద్యాశాఖ విశ్రాంత అధికారి కర్రి దివాకర్‌రావు, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ధనాల విష్ణు చౌదరి, విశ్రాంత ఖజానా శాఖ అధికారి వడ్డాది లక్ష్మణరావు, విశ్రాంత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కర్రి శివన్నారాయణ, అనకాపల్లి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేదుల వెంకట రామారావు, పెనుమత్స వెంకటేశ్వరరాజు, వానపల్లి త్రినాథ్, నెల్లూరు సాంబశివరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యుడు సత్యనారాయణ

మునగపాక: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులు ఏలేటి సత్యనారాయణ కోరారు. మునగపాకలోని ఎంఎస్ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి హిందూ ధర్మ పరిరక్షణలో సమాజ పెద్దల పాత్ర అనే అంశంపై సద్భావన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజాన్ని సమర్థంగా, శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సనాతన సంప్రదాయాలను కొనసాగించేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మేడవరపు జగదీశ్వరరావు, ఐనెల్ల అప్పారావు, కర్రి లక్ష్మీనారాయణ, పిల్లా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు

రాంబిల్లి : మండలంలో వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అపరాల నూర్పులు జోరుగా జరుగుతున్నాయి. రైతులు ఈ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం పెసర, మినుము(అపరాలు) పంటలను రైతులు సాగు చేశారు. దీంతో కుప్పలుగా వేసిన వరి చేనును రైతులు నూర్పులు చేస్తున్నారు. ముందుగా సాగు చేసిన రబీ వరి చేను నూర్పు పనులను రైతులు చేస్తున్నారు. నూర్పు పనులకు రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బస్తాకు రూ.300 అదనంగా పలుకుతోంది. గత ఏడాది 75 కేజీల బస్తా ధర రూ.1400 పలకగా ప్రస్తుతం రూ.1700 పలుకుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నాలుగు కేంద్రాల్లో 768 మంది విద్యార్థులు



యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగ పరీక్షలకు సిద్ధం చేసిన హాలు

మునగపాక : మండలంలో నాలుగు కేంద్రాల్లో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు విలేకరులకు తెలిపారు. మండల వ్యాప్తంగా 6 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పాటిపల్లి మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మూడు ప్రయివేటు స్కూళ్లకు సంబంధించి 768 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకు నాలుగు పరీక్ష కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నాగులాపల్లి హైస్కూల్లో 128 మంది, గణపర్తి హైస్కూల్లో 176 మంది, మునగపాక హైస్కూల్లో 235 మంది, ప్రగతి పబ్లిక్ స్కూల్లో 229 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆయా కేంద్రాలకు ఉదయం 8.45 గంటలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయం, టాయ్‌లెట్స్, బెంచీలు వంటి సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు ఇష్టపడి,కష్టపడి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రాంబిల్లి : పదో తరగతి పరీక్షలకు మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. రాంబిల్లి, దిమిలి, పంచదార్ల ఉన్నత పాఠశాలలతో పాటు రాంబిల్లిలో రవీంద్ర స్కూల్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. 9 ప్రభుత్వ, 5 ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 561 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎస్.రాయవరం: మండలంలో సోమవారం నుంచి 10 వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఏఎస్ఎన్ఎస్ మూర్తి తెలిపారు. ఎస్.రాయవరం, దార్లపూడి, పి.ధర్మవరం, కొరుప్రోలు, తిమ్మాపురం శ్రీ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది మండలంలో 1067 మంది విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులు కాగా, 57 మంది ప్రయివేటుగా పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పగడ్బందీగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమయానికి ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

యలమంచిలి రూరల్ : పదో తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలకు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో వై.మీనాక్షి తెలిపారు. తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 227, కొత్తపేట హైస్కూల్లో 240, సెయింట్ మేరీస్ స్కూల్లో 220, శ్రీచైతన్య స్కూల్లో 235 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టినట్టు పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షక అధికారులు తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. నో సెల్‌ఫోన్ జోన్‌గా పరీక్ష కేంద్రాలను ప్రకటించారు. పరీక్ష సమయంలో ఏ ఒక్కరూ మొబైల్ ఫోన్ తీసుకెళ్లకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

కేంద్ర బలగాల మార్చ్ పాస్ట్



కె.కోటపాడులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

కె.కోటపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటరు ఓటుహక్కు వినియోగించునే పరిస్థితులను కల్పించే చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో మార్చ్‌పాస్ట్ నిర్వహించారు.కె.కోటపాడు, చౌడువాడ, గుల్లేపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కె.కోటపాడు పోలీసులు కవాతు నిర్వహించారు.

నూతన వ్యవసాయ విధానాలపై దృష్టి



బంగారుమెట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

బుచ్చెయ్యపేట: రైతులు ఆధునిక వ్యవసాయ నూతన విధానాలను స్వాగతించి అధిక పంట దిగుబడులపై దృష్టి సారించాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. రాజ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో కింజరాపు ఎర్రంనాయుడు వ్యవశాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆదివారం బంగారుమెట్టలో రైతులకు గ్రామీణాభివృద్ధి, నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. పూర్వ నుంచి వస్తున్న వ్యవసాయ విధానాలతోపాటు ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ విధానాలను అవవర్చుకోవాలని సూచించారు. యంత్రాలు, వాటి పని తీరు, అధిక పంట దిగుబడులపై శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ కిశోర్, విద్యార్థినులు ముధురిమ, సోనీ, రత్న ప్రశాంతి, వాత్సల్య, శ్రీవిష్ణు, యమున అవగాహన కల్పించారు.

ఫ్లెక్సీలు, బోర్డుల తొలగింపు



కశింకోటలో ఫ్లెక్సీలు, బోర్డులు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కశింకోట: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కశింకోటలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బోర్డులు, జెండాలు, బ్యానర్లను పంచాయతీ సిబ్బంది ఆదివారం తొలగించారు. స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి, జాతీయ రహదారి, గ్రామ వీధుల్లో పలుచోట్ల ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు కప్పారు. పంచాయతీ కార్యదర్శి కె.రమేష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సోమవారం కూడా మిగిలిన చోట్ల వీటిని తొలగించనున్నట్లు ఆయన తెలిపారు.